మృతదేహాలను బంధువులకు అప్పగించాలి

సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మం కమాన్‌బజార్, మే 26: ఎన్‌కౌంటర్‌లో ఈ నెల 21వ తేదీన మృతిచెందిన నంబాల కేశవరావుతో పాటు ఇతర మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కేంద్ర కమిటీ సహాయ కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని రామనర్సయ్య భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌కౌంటర్ జరిగి ఆరు రోజులవుతున్నా మృతదేహాలను అప్పగించకపోవటం దుర్మార్గపు చర్య అన్నారు. ఇప్పటికైనా నరమేధం నిలిపివేసి, శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేశారు. నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, రామయ్య పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించిన ఎమ్మెల్యే

సత్తుపల్లిటౌన్, మే 26: పట్టణంలో నూతనం నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల, అంబేద్కర్‌భవనం నిర్మాణ పనులను ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం పరిశీలించి కాంట్రాక్టర్లతో పనుల గురించి తెలుసుకున్నారు. అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని మాత శిశు వార్డును సందర్శించారు. ఆసుపత్రిలో బాలింతలు, పుట్టిన పసిబిడ్డల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్యరీత్యా డాక్టర్స్, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది అప్రమత్తంగా ఉంచాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

తిరుమలాయపాలెం, మే 26: తన కుమారుడు దారమళ్ల సందీప్ ఆత్మహత్యాయత్నానికి కారకుడైన తిరుమలాయపాలెం ఎస్సై కూచుపూడి జగదీష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని ఎర్రగడ్డకు చెందిన తారమళ్ల తిరుపయ్య ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎర్రగడ్డలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడైన తన కుమారుడు సందీప్‌ను ఎస్సై శారీరకంగా, మానసికంగా వేధించాడని పేర్కొన్నారు. దొంగతనం కేసులో సంబంధం ఉన్న మరో వ్యక్తి బెల్లం అభిలాష్‌ను కాపాడేందుకు ఎస్సై తన కుమారుడిని కొట్టి బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ జరిగిపి ఎస్సైపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సందీప్‌కు ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు కల్పించాలని కోరారు.

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన ఎస్సై

కారేపల్లి, మే 26: తన స్థలంలో రేకుల గది వేసుకున్నానని, నేను లేని సమయంలో కొంతమంది ఈనెల 24వ తేదీన గదిని పడవేశారని, వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు మూతి చంద్రశేఖర్ పోలీసుకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కారేపల్లి ఎస్సై స్థలాన్ని సోమవారం పరిశీలించారు. బాధితుడు మూతి చంద్రశేఖర్ మాట్లాడుతూ సింగరేణి మండలంలోని కారేపల్లి క్రాస్ రోడ్డులో ఉన్న ఇంటి నెంబర్ 5-103తో రేకుల షెడ్డు, బాత్రూంతో సహా మూడు కుంటలు ఇంటి స్థలం ఉందన్నారు. 2014వ సంవత్సరంలో అట్టి స్థలం నా స్వాధీనంలోకి వచ్చిందన్నారు. నేను లేని సమయంలో కొందరు నా ఇంటిని కూల్చారని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు స్థలాన్ని పరిశీలించిన ఎస్సై రాజారాం ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టనున్నట్లు బాధితుడు తెలిపారు.

ప్రభుత్వ బడిని కాపాడుకుందాం..

ఖమ్మం అర్బన్, మే 26 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి పిలుపునిచ్చారు. సోమవారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాతాను ఖమ్మం వైరారోడ్డులో జెండా ఊపి ప్రారంభించారు. పదిరోజులపాటు ప్రచారం నిర్వహిస్తాయన్నారు. నాయకులు రంజాన్, నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, వెంకన్న, రాంబాబు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు శిక్షణ

ఖమ్మం, మే 26 : ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నమస్తే సంస్థ సహకారంతో నగర శానిటేషన్ సిబ్బందికి సోమవారం ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. మురుగునీటి వ్యవస్థను సురక్షితంగా నిర్వహించటం, శుభ్రత పనులకు అవసరమైన పరికరాల వాడకం, ప్రమాదాలను ఎలా నివారించుకోవాలి వంటి విషయాలపై అవగాహన కల్పించారు. శానిటేషన్ సిబ్బందికి మురుగు లైన్లను ఎలా శుభ్రం చేయాలో ప్రత్యక్షంగా చూపిస్తూ శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా గ్లోవ్స్, బూట్లు, మాస్కులు, ప్రొటెక్షన్ డ్రెస్ వంటివి ధరించడం వల్ల అనారోగ్య సమస్యలు రాకుండా చూసుకోవచ్చని వివరించారు.

కింగ్స్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

కారేపల్లి, మే 26: మండలంలోని పంతులునాయక్‌తండాలో కింగ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను తొడిదలగూడెం మాజీ సర్పంచ్ బానోత్ కుమార్, మాజీ ఎంపీటీసీ పెద్దబోయిన ఉమాశంకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు లభిస్తామన్నారు. కార్యక్రమంలో యూత్ నాయకులు తేజావత్ రాంజీ నాయక్, కేలోత్ కోటేశ్, థామస్, శ్రీనివాస్, గణేశ్, చందు, శ్యామ్, సిద్దు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగుమందుల షాపుల తనిఖీ

ముదిగొండ, మే 26: ముదిగొండలోని ఫెర్టిలైజర్ షాపులను వ్యవసాయ, పోలీస్ అధికారులు సంయుక్తంగా సోమవారం తనిఖీ చేశారు. షాపుల్లోని స్టాక్, రిజిస్టార్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలనీ అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో సరిత, ఎస్సై అనతరాములు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

లింక్ డాక్యుమెంట్ పోయినది

నంద్రు మనోహర్‌రావు, S/o. (లేటు) నాగభూషణం, ఇ.నెం. 3-8-239/1, జహీర్‌పుర, ఖమ్మం, ఖమ్మం జిల్లా అను నేను గాంధీచౌక్ వెల్తుండగా ఆటోలో నా యొక్క లింక్ డాక్యుమెంట్ మిస్ అయినది. (**డాక్యుమెంట్ నెం.** 2055/2017) దొరికినవారు ఈ నెంబరుకు సంప్రదించగలరు. 9182065449.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఇళ్ల స్థలాలు ఇచ్చినవారికి భూమి చూపించాలి

తిరుమలాయపాలెం, మే 26: తిరుమలాయపాలెంలో పభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలిచ్చిన వారికి భూములు చూపించాలని కోరుతూ సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహసీల్దారు విల్సన్‌కు వినతిపత్రం అందజేశారు. తిరుమలాయపాలెంలో 2024లో 130 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చినప్పటికి ఇంతవరకు ప్రభుత్వం వారికి భూమి చూపలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు నాగటి సురేశ్, దొడ్డ లింగస్వామి, కొమ్ము నాగేశ్వరావు, నెర్సుల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

మధిర: ఖమ్మంపాడులో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ, ఎర్రుపాలెంలో అధికారులు, తిరుమలాయపాలెంలో చైర్మన్ చావా వేణు, ఏవో సీతరామరెడ్డి

మధిర, మే 26: ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న జీలుగు విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్ చంద్ర సూచించారు. సోమవారం మండలంలోని ఖమ్మంపాడులో ఏడీఏ రైతులకు జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగు విత్తనాలు పొలంలో వేయడం వల్ల రసాయన ఎరువుల ఉపయోగం తగ్గుతుందన్నారు. అర్హులైన రైతులకు జీలుగులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఖమ్మంపాడు ఏఈవో సుష్మ, పీఏసీఎస్ సీఈవో శ్రీనివాసరెడ్డి, సీహెచ్.లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

మధిర పీఏసీఎస్‌లో..

మధిర పట్టణంలో పీఏసీఎస్‌లో రైతులకు వరి విత్తనాలు, జీలుగులను మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తిని పెంచడంలో విత్తనం ఒక కీలకమైన వనరు అని, ఇతర వనరుల పనితీరు, సామర్థ్యం విత్తనాల నాణ్యతపై ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అయిలూరి సత్యనారాయణరెడ్డి, డైరెక్టర అద్దంకి రవికుమార్, నాయకులు మిరియాల వెంకటరమణగుప్త, కర్నాటి రామారావు, జానీపాషా, రైతులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం మండలంలో..

ఎర్రుపాలెం, మే 26: మండలంలోని తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం, రాజుపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ పరిధిలో రైతులకు సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలను సోమవారం ఏడీఏ స్వర్ణ విజయ చంద్ర సోమవారం పంపిణీచేసి మాట్లాడారు. జీలుగు విత్తనాల వల్ల రసాయన ఎరువుల ఉపయోగం తగ్గుతుందన్నారు. జీలుగులు పంపిణీ రైతులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఏఈవోలను ఆదేశించారు. సుబాబుల్ రైతులకు జీలుగులు పంపిణీ చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, సొసైటీ సీఈవో కృష్ణ, ఏవో బీ.సాయి శివ, ఏఈవోలు సింధూర్, కృష్ణకుమారి, నాయకులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, బాషా, గుడేటి బాబురావు, రైతులు పాల్గొన్నారు.

జీలుగులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

వైరాటౌన్, మే 26: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగు విత్తనాలను సోమవారం వైరాలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైరా వ్యవసాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణశ్రీ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, నాయకులు కట్ల రంగారావు, జైపాల్, శీలం వెంకటనర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం, మే, 26: స్థానిక పీఏసీఎస్‌లో పీఏసీఎస్ చైర్మన్ చావా వేణు సోమవారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో 250 క్వింటాల జీలుగులు, 150 క్వింటాల జనుములు, 5 క్వింటాల పిల్లి పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని రైతులకు సూచించారు. పచ్చి రొట్ట విత్తనాలు వేసినట్లయితే భూమిలో కార్బన్ శాతం పెరిగి సూక్ష్మ జీవులు పెరిగి భూమి గుల్లబారి మొక్కలకు పోషకాలను అందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారామరెడ్డి, గోళ్ల లింగయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు రాయితీ సౌకర్యం

కూసుమంచి, మే 26: ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్(ఎంఐడీహెచ్) పథకం ద్వారా రాయితీ సౌకర్యం కల్పించడం జరుగుతుందని పాలేరు నియోజకవర్గ ఉద్యానశాఖ అధికారి పీ అపర్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా పండ్ల తోటలు (మామిడి, జామా, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, ఉసిరి) సాగు చేసే రైతులకు ఈ పథకం ద్వారా 40శాతం రాయితీ, కూరగాయలకు సంబంధించి మిరప సాగుకు గాను 50శాతం రాయితీ మల్చింగ్‌కు, యాంత్రీకరణలో భాగంగా బ్రష్‌కట్టర్, ఫవర్ వీడర్స్, 40శాతం రాయితీపై అందజేస్తామన్నారు. అదేవిధంగా సూక్ష్మనీటి పథకానికి ఉద్యాన సాగు రైతులకు వందశాతం రాయితీపై బిందు సేద్యం పరికారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆర్‌కేవీవై పథకం ద్వారా పండిళ్ల సాగు పద్ధతిలో కూరగాయల సాగు చేసే రైతులకు 50శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. మరిన్ని వివరాలకు పాలేరు ఉద్యానశాఖ అధికారి సెల్ నెంబర్ 8977714104లో సంప్రదించాలని కోరారు.

1న వైద్యశిబిరం

వైరాటౌన్, మే 26: వైరాలోని తల్లాడ రోడ్డులో ఉన్న సాకేత్‌కృష్ణ ఆస్పత్రిలో జూన్1వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వెనికోస్ వెయిన్స్ ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సాకేత్ కృష్ణ హాస్పిటల్ డాక్టర్ సతీష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరాలకు సంబంధించి బాధపడుతున్న వారు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. న్ని సద్వినియోగం చేసుకోవాలని సాకేత్ కృష్ణ హాస్పిటల్ డాక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వరదముంపు బారిన పడకుండా ముందస్తు చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి

అధికారులు, ఉద్యోగులకు సూచనలు చేస్తున్న కమిషనర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్, మే 26: వానకాలం సీజన్ దృష్టిలో ఉంచుకొని, గత అనుభవనాలను అనుగుణంగా మున్నేటి వరద ముంపు బారీన సమీప కాలనీవాసులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏదులాపురం మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ పీ రాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన ప్రకృతి వైపరీత్యాల నివారణ కమిటీ బాధ్యుల సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. గతేడాది మున్నేరు వాగు ఉగ్రరూపం దాల్చడంతో మున్సిపాలిటీ పరిధిలోని అనేక కాలనీలు నీట మునిగాయన్నారు. అయితే ఈ సంవత్సరం అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండ ఉండేందుకు గాను అన్ని శాఖల అధికారులతో సమన్వయం కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మున్నేరు వరద ముంపు ప్రాంతాలను ఐదు సెక్టార్‌లుగా విభజించి, ఐదగురు గెజిటెడ్ అధికారులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి సెక్టార్‌కు సెక్టోరియల్‌లో అన్ని శాఖల ఉద్యోగులు, గజ ఈతగాళ్లతో కూడిన టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఏర్పాటు చేసిన టీంలు ప్రజలను అలార్టు చేయడం. పునరావాసానికి తరలించడం. రహదారులను బ్లాక్ చేయడం వంటి చర్యలు చేపడుతారన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్ కుమార్, ఇరిగేషన్, మున్సిపల్ సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో తొలివిడతలో 448 ఇందిరమ్మ ఇండ్లు

ఖమ్మం రూరల్, మే 26: తొలివిడత ఇందిరమ్మ ఇండ్లను మండలంలో 448మందికి అవకాశం కల్పిస్తూ మండల అభివృద్ధి అధికారులు తుది జాబితా ఖరారు చేశారు. మండలంలో మొత్తం 1689మంది ఇందిరమ్మ ఇండ్లకు అర్హులుగా అధికారులు జాబితా సిద్ధం చేయగా వారిలో తొలిజాబితా(ఎల్-1)లో 448మందికి అవకాశం కల్పించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో అధికారులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా మంజూరి పత్రాలు అందజేశారు. మిగిలిన లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవం (జూన్-2)న పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. తొలివిడతలో ఆరెకోడు గ్రామంలో 15, ఆరెకోడుతండా 12, చింతపల్లి 23, గోళ్లపాడు 36, గూడూరుపాడు 15, కాచిరాజుగూడెం 30, కస్నాతండా 19, కొండాపురం 30, ఎం. వెంకటయపాలెం 50, మంగళగూడెం 25, పల్లెగూడెం 20, పోలెపల్లి 25, పాలిశెట్టిగూడెం 27, పొన్నెకల్ 26, తల్లంపాడులో 50, తనగంపాడులో 20, తీర్థాల గ్రామంలో 20మందికి మంజూరు చేశారు. వీరితో పాటు ఆదర్శగామం అరెంపులలో గతంలో 97మంది, రఘునాథపాలెం నుంచి రూరల్ మండలంలో విలీనమైన కామంచికల్, దారేడు, పడమటి గూడెం గ్రామాలకు 61మందికి మంజూరు చేశారు. తొలివిడతలో రూరల్ మండలంలో 606 ఇండ్లు మంజూరు చేసినట్లు తెలుస్తుంది. అయితే అర్హుల పేర్లకు అధికారులు గోప్యత పాటిస్తుండటం విశేషం.

జీవాల యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలి

జీవాల యజమానులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్

ఖమ్మం రూరల్, మే 26: మండలంలోని ఆరెకోడు తండాకు చెందిన జీవాల యజమానులను (రైతులను) ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విషాహారం తిని తండాకు చెందిన సుమారు 50 మేకలు, గొర్రెలు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. సోమవారం వేణు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు తండాకు వెళ్లి గిరిజన రైతులను పరామర్శించారు. జరిగిన ఘటన గురించి పశువైద్యుడు ఏ హరీష్, బాధిత రైతులను అడగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఫోన్ ద్వారా రైతులతో మాట్లాడారు. బెల్లం వేణు మాట్లాడుతూ నిరుపేద గిరిజన రైతులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వారికి అవసరమైన మేర నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏదులాపురం సొసైటీ చైర్మన్ జే.లక్ష్మణ్‌నాయక్, ఆరెకోడుతండా మాజీ సర్పంచ్ జగదీశ్, తోట జగన్, ముత్యం కృష్టారావు, రైతులు పాల్గొన్నారు.

డ్రైనేజీని పూర్తి చేయాలని ధర్నా

కేఎంసీ కార్యాలయం ఎదుట 25వ డివిజన్ ప్రజల ధర్నా

ఖమ్మం, మే 26: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్ పరిధిలో గల అద్దంకి వారి వీధి ఎదురుగా రైల్వేట్రాక్ వైపు వెళ్లే డ్రైనేజీని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక కార్పొరేటర్ గోళ్ల చంద్రకళావెంకట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు సోమవారం నగర కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు గోళ్ల వెంకట్ మాట్లాడుతూ సరిగ్గా ఏడాదిన్నర క్రితం రూ.9 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి టెండర్ ఫైనల్ అయిందని, పది శాతం పనులు చేసి కాంట్రాక్టర్ పనులు చేయకుండా వెళ్లిపోయాడన్నారు. డ్రైనేజీని పూర్తి చేయకపోతే వర్షాకాలంలో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు తీవ్ర పడాల్సి వస్తుందన్నారు. అధికారులు చొరవ చూపి డ్రైనేజీ నిర్మాణానాన్ని వెంటనే పూర్తిచేయాలని, లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు గట్టు శ్రీను, ఉపేందర్‌రెడ్డి, వాసు, మధు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా విజవయంతం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరాటౌన్, మే 26: శనివారం వైరాలో జరిగిన మెగా జాబ్‌మేళా విజయవంతం అయిందని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. సోమవారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెవెంత్ నుంచి డిగ్రీ, బీటెక్, బీఫార్మసి, ఐటీఐ, ఎం ఫార్మసి, ఇంటర్, డిగ్రీ చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు 90 కంపెనీలతో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క పాల్గొన్నారు. మొదటి విడతగా 2504 మందికి నియామక పత్రాలు అందజేశారు. రెండో విడతగా 1540 మంది నియమితులయ్యారు. కార్యక్రమంలో నాయకులు బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, కట్ల రంగారావు, సూతకాని జైపాల్ పాల్గొన్నారు.

పలువురి మృతికి నామా సంతాపం

ఖమ్మం, మే 26 : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని మామిళ్లగూడేనికి చెందిన జర్నలిస్టు సాయిరాం సతీమణి అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్ సభాపక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సాయి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. చండ్రుగొండ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మేడ మోహన్‌రావు మేనల్లుడు, గుర్రంగూడెం గ్రామస్తుడు గోదా చక్రధర్ భార్య ఊహ మృతిచెందింది. విషయం తెలుసుకున్న నామా మోహన్‌రావుతో ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. ఊహ ఆత్మకి శాంతి కలగాలని కోరుతూ ఆమె మృతి పట్ల సంతాపం తెలిపారు.

రేపు జాబ్ మేళా

మామిళ్లగూడెం, మే 26 : ఖమ్మం ఉమ్మడిజిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు గాను ఈ నెల 28వ తేదీ బుధవారం ఉదయం 10గంటలకు ఖమ్మంలోని మోడల్ కెరియర్ సెంటర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల టేకులపల్లిలో జాబ్‌మేళా నిర్వహిస్తునన్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మాధవి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో ఎంటర్ మేనేజర్, ఈఆర్‌వో, ఎల్‌పీవో వంటి 20 పోస్టులు ఖాళీ ఉన్నాయని, వాటికి 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటి పదో తరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు చదువుకున్న వారు అర్హులని పేర్కొన్నారు. శ్రీరామ్ చిట్స్ ఎండ్ లైఫ్ ఇన్సూరెన్సులో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్స్ 50ఖాళీలు ఉన్నాయని 20 నుంచి 35 ఎండ్ల వయస్సు ఉన్న డిగ్రీ చదువుకున్న పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. అర్హతలు, ఆసక్తి ఉన్నవారు జాబ్‌మేళాకు రావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం అర్బన్, మే 26 : భద్రాద్రి జోన్‌లోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకులాల్లో తాత్కాలిక అధ్యాపక, ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జోనల్ అధికారి స్వరూపరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 తెలంగాణ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయడానికి ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, లైబ్రేరియన్, హెల్త్ సూపర్‌వైజర్ ఎంపిక కోసం ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తులను నగరంలోని జోనల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. డెమో, సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 30వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల ఖమ్మంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థులకు ప్రత్యేక వృత్తి నైపుణ్య శిక్షణ

ఎర్రుపాలెం, మే 26: ఎర్రుపాలెంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో చదువుకొని ఉద్యోగం పొందేలా వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారని ఎర్రుపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ చావా జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017 నుంచి ఎర్రుపాలెంలోని సాంఘిక సంక్షేమ కళాశాలలో చదువుకొని ఇప్పటి వరకు ఎలాంటి ఉద్యోగం రానివారు ఉంటే వారికి ప్రత్యేకంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి పొందేలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకోసం ప్రభుత్వ చొరవతో ఉన్నతి ఫౌండేషన్ ముందుకొచ్చి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. 19 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన గురుకుల విద్యార్థులకు సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షన ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు ఎర్రుపాలెం కళాశాలలో దరఖాస్తుల చేసుకోవాలని తెలిప